# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

❖ అడవుల రక్షణకు అటవీ శాఖ అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

❖ ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి.

❖ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

❖ ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు పెడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

========================

అటవీ సంరక్షణ సమిష్టి కర్తవ్యమని, నేటి, భవిష్యత్ తరాలు బాధ్యత తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు అరణ్యభవన్‌లో ఈ రోజు జరిగిన అటవీ అమరవీరుల సంస్మరణ సభలో ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు. విధుల్లో ప్రాణాలు అర్పించిన అధికారులు, సిబ్బందికి ఆయన నివాళులు అర్పించారు. అక్రమార్కుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన 23 మంది అటవీ శాఖ అధికారుల కుటుంబ సభ్యులకు సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల రక్షణకు అటవీ శాఖ అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామన్నారు. వివిధ వర్గాల నుంచి అటవీ శాఖకు 5 కోట్ల రూపాయల విరాళం సేకరించి ఇస్తానని తెలిపారు. అడవులను సంరక్షించడంలో అధికారుల పాత్ర కీలకమని, అటవీ సంపద అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించేలా కృషి చేస్తామని పవన్ కల్యాణ్ పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

అదే విధంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల అరణ్య భవన్ వద్ద అమరవీరులకు అటవీ శాఖ అధికారులు నివాళులర్పించారు. అటవీ శాఖలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగఫలం ఎనలేనిదని కొనియాడారు.

=======================

ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ సమావేశాలు రేపటి నుంచి జరుగనున్నాయి. ఉదయం 10 గంటలకు శాసనమండలి, శాసనసభ భేటీ అవుతాయి. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరుతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు ముగియనున్న నేపథ్యంలో సమావేశాల మొదటి రోజే 11వ తేదీన 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. సభాపతి చింతకాయల అయన్నపాత్రుడి అధ్యక్షతన జరిగే సభా వ్యవహారాల సలహా మండలి(బీఏసీ)లో ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

=======================

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తాడికొండలోగల గురుకుల పాఠశాలలో ఈ రోజు జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో మంత్రి పాల్గొని, నూతనంగా నిర్మించిన ఉపాధ్యాయుల వసతిగృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పాఠశాల, సామాజిక భవనాలు, ప్రత్యేక నడక దారులు వంటి కనీస వసతులు కల్పించేందుకు 5 ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఎంపీ ల్యాడ్స్, కార్పొరేట్ సామాజిక భాద్యత నిధులు, ఇతర మార్గాల్లో నిధులు సేకరించి పనులు చేపడతామని వెల్లడించారు. విద్యార్థులు ఉన్నత ఆలోచలనలను పెంపొందించుకోవాలని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

=======================

అనకాపల్లి రైల్వే స్టేషన్ ను ఆదర్శ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేస్తానని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటి ఛైర్మన్ సీఎం రమేశ్ అన్నారు. ఈ రోజు ఆయన అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను కూటమి నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... "వికసిత్ భారత్" కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని, తన పార్లమెంటు పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

=======================

ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు పెడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య రంగంలో ఎంతో కృషి చేసి.. ఎన్నో ఔషధాలు అందించిన డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు స్వస్థలం భీమవరం. తొలి టెట్రాసైక్లిన్ యాంటీ బయోటిక్ 'అరియోమైసిన్'ను ఆయన కనుగొన్నారు. బోద, క్షయ వ్యాధుల కట్టడికి ఔషధాలు రూపొందించి, క్యాన్సర్ చికిత్సలో కీమోథెరపీకి వాడే తొలితరం డ్రగ్ ను కూడా ఆయనే అభివృద్ధి చేశారు. తన ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

=======================

రానున్న రబీ కాలం నుంచి అమలయ్యే కొత్త పంటలు బీమా పథకంలో రైతులు స్వచ్ఛందంగా చేరాలని పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. భీమవరంలో ఈ రోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ.. పంట దిగుబడిలో ఒకటిన్నర శాతంగా లెక్కించి బీమా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పంట రుణాల తీసుకునే సమయంలో రైతులు రైతు సేవ కేంద్రాల్లో డిసెంబర్ 31వ తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొంటూ ..

(వాయిస్ 30 సెకన్లు)

=======================

భారత పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాలను(IPPB) జాతీయ చెల్లింపు కార్పొరేషన్ (NPCI)తో అనుసంధానం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈనెల 15వ తేదీ వరకు ప్రతి సచివాలయ పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని అనంతపురం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ గుంపస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు లబ్దిదారులు బ్యాంకు, తపాలా శాఖ ఖాతాలను ఎన్పీసీఐతో అనుసంధానం చేయించుకోవాలని ఆయన సూచించారు.

=======================

కాఫీ తోటల రైతు కూలీల పిల్లల విద్యా ఉపకార వేతనం కోసం ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు కురుసా ఉమామహేశ్వరరావు కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జిల్లా కాఫీ బోర్డు కార్యాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ విద్యార్ధులకు 5 వేల రుపాయలు, డిగ్రీ కోర్సుకు 7 వేల 500 రూపాయలు, పోస్టు గ్రాడ్యుయేషన్ కు 15 వేల రూపాయల, ఆపై కోర్సుల విద్యార్ధులకు 20 వేల రూపాయలను ఉపకార వేతనంగా కాఫీ బోర్డు అందించనుందని తెలిపారు. ఉపకార వేతనం పొందేందుకు గత విద్యా సంవత్సరంలో ఎస్.సి, ఎస్టీ విద్యార్ధులకు 50 శాతం, ఇతరులకు 60 శాతం పైగా మార్కులు పొంది ఉండాలని స్పష్టం చేస్తూ... అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

=======================
=======================